సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 25 । జూలై । 2023



మత్స్యకారుల సంక్షేమానికి మోకాలడ్డు !
ఒకరికి ..రెండు ఎకరాల నీటి విస్తీర్ణం అనే నిబంధన మత్స్యకార సొసైటీలో చేరడానికి సభ్యులకు అడ్డంకిగా మారింది
8లో..



భూమి కబ్జా చేస్తున్నారని..
భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదనతో చేగుంటలో ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.
8లో..



కట్టిన ఇళ్లు ఎప్పుడిస్తరు?
నిర్మాణం పూర్తి చేసుకున్న డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎప్పుడిస్తారని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు.
9లో..

న్యూస్‌రీల్

సోమేష్‌కుమార్‌ను కలిసిన కలెక్టర్



సోమేష్‌కుమార్‌కు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్

సిద్దిపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సోమేష్ కుమార్‌ను కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సోమేష్ కుమార్ వేములవాడకు వెళ్తుండగా మార్గమధ్యలో సిద్దిపేట శివారులోని హరిత హోటల్‌లో విశ్రాంతి కోసం ఆగారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ మొక్కను అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్ / జగదేవ్‌పూర్(గజ్వేల్) : ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పన్యాల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నారాయణరావుపేట మండలం మల్యాల ప్రాథమిక పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా జగదేవ్‌పూర్ మండలం మునిగడప పాఠశాలలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.కిషన్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.


హాఫ్ మారథాన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేటరూరల్: వచ్చే నెల 6వ తేదీన రంగనాయక సాగర్ ప్రాజెక్టుపై జరిగే హాఫ్ మారథాన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానికసంస్థలు) గరిమా అగర్వాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెవిన్యూ విభాగం అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తుల బాపిరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

నేడే చివరిరోజు

సిద్దిపేటకమాన్: హాఫ్ మారథాన్ రన్ పోటీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేడు(మంగళవారం) ముగియనుందని, ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. పోటీల్లో గెలుపొందినవారికి నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పంటను పరిశీలిస్తున్న శివకుమార్

రాయపోలు(దుబ్బాక): ప్రస్తుత వర్షాలకు పంటలు తెగుళ్ల బారిన పడే అవకాశముందని, సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే సమస్య ఉండదని జిల్లా వ్యవసాయాధికారి శివకుమార్ సూచించారు. సోమవారం ఆయన దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వరి, పత్తి, మొక్కజొన్న చేలను పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో అధికంగా నీరు నిలిస్తే కాల్వల ద్వారా బయటకు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి గోవిందరాజులు, ఏఈఓ మాధవి తదితరులున్నారు.

స్వచ్ఛత క్రానికల్స్‌లో జిల్లాకు చోటు

సిద్దిపేటరూరల్: జాతీయ స్వచ్ఛత క్రానికల్స్‌లో సిద్దిపేట జిల్లాకు చోటు దక్కింది. ములుగు మండలం క్షీరసాగర్‌తోపాటు చిన్నకోడూరు మండల కేంద్రం ఢిల్లీ స్థాయిలో మెరిశాయి. ఆదివారం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ క్రానికల్స్ పేరిట కేంద్ర జలశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఆధ్వర్యంలో స్వచ్ఛత క్రానికల్స్ సంకలనాలు ఆవిష్కరించారు. ఇందులో క్షీరసాగర్, చిన్నకోడూరు గ్రామాల్లో సంపూర్ణ స్వచ్ఛత కోసం తీసుకుంటున్న చర్యలు అభినందిస్తూ కథనాలు ప్రచురించారు.

వీడని చిక్కులు!

పెండింగ్‌లో 'ధరణి' దరఖాస్తులు
- కలెక్టర్ లాగిన్‌లో కుప్పలు తెప్పలు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని వైనం
- కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్న బాధితులు

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు	
కలెక్టర్ లాగిన్‌లో	: 2678
స్టేట్ లెవెల్ కార్యాలయంలో	: 1000
దరఖాస్తు నోటీస్ జనరేట్ చేసినవి	: 300
తిరస్కరించినవి	: 6000

భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ రైతులకు శాపంగా మారింది. సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్, కోహెడ, అక్కనపేట రైతులు భూ సమస్యలపై మీసేవలో దరఖాస్తు చేసుకుని రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు.

– కోహెడరూరల్(హుస్నాబాద్)



రైతుల సౌలభ్యం కోసం ప్రారంభించిన ధరణి పోర్టల్ అనేక సమస్యలు తెచ్చిపెట్టింది. ఏళ్లు గడుస్తున్నా చిక్కులు వీడటం లేదు. సర్వే నంబర్ నాట్ సైన్, బ్లాక్ లిస్ట్ భూములు, విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు, పట్టాదారు పేర్లలో తప్పులు, మిస్సింగ్ సర్వే నంబర్‌తోపాటు పలు రకాల కరెక్షన్ కోసం మీసేవలో, గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. కానీ కలెక్టర్ కారాలయంలో భూమి గ్రీవెన్స్ సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ఫైల్ ముందుకు కదలడం లేదని వాపోతున్నారు. వేల దరఖాస్తులు కలెక్టర్ లాగిన్‌లో పేరుకు పోయాయని చెబుతున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

ధరణి పోర్టల్‌లో గ్రీవెన్స్ ల్యాండ్ మ్యాటర్‌తో పాటు 33 రకాల మాడ్యూల్స్‌ను ప్రభుత్వం పొందు పరిచింది. కానీ, రైతుల భూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకుండా పోతుంది. మిసింగ్ సర్వే నంబర్, భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు సమస్యలతో అసలుకే మోసం వస్తుంది. తప్పుల నమోదుతో కర్షకులు రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీకి అనర్హులవుతున్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకుంటే రూ.1500 వరకు ఖర్చు అవుతుందని, అయినా పని కావడం లేదని రైతులు వాపోతున్నారు.

పెండింగ్‌లో 4వేల దరఖాస్తులు

మీసేవలో దరఖాస్తు చేసుకున్న సుమారు 4వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తు చేసుకున్నాక జనరేట్ నోటీస్ ఫైళ్లు 274, కలెక్టర్ లాగిన్‌లో సుమారు 3వేల దరఖాస్తులు, స్టేట్ లెవల్ కార్యాలయంలో 958 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా మ్యూటేషన్లు, జీఎల్ఎం లాంటి దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. కాని మిస్సింగ్ సర్వే నంబర్, భూమి వ్యత్యాసం అంశాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. పాత 1బీ రికార్డుల్లో ఉన్న భూముల వివరాలు కొత్త పట్టాపాసు పుస్తకాల్లో తప్పుగా నమోదు కావడం వల్ల సమస్యలు ఎక్కువగా తలెత్తుతున్నాయి. ప్రతి రోజు పదుల సంఖ్యల్లో దరఖాస్తులు నమోదు కావడం గమనార్హం.

రైతులకు శాపంగా భూ ప్రక్షాళన

ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం భూ ప్రక్షాళన చేపట్టింది. దాని ప్రకారం భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తు ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చింది. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూమి హెచ్చుతగ్గులు, పట్టాదారుల పేర్ల మార్పు, ఇంటి నెం తప్పు పడటం, మిస్సింగ్ సర్వే నంబర్లు, పట్టా భూములు ప్రభుత్వ భూములుగా, ప్రభుత్వ భూములు పట్టా భూములుగా రికార్డు చేసి బ్లాక్ లిస్టులో పెట్టారు. ఇష్టారాజ్యంగా భూ ప్రక్షాళన చేసి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టారు.

కలెక్టర్ వద్ద తీవ్ర జాప్యం

తప్పుల సవరణ కోసం బాధితులు మీసేవలో దరఖాస్తు చేసుకుంటే అవి నేరుగా కలెక్టర్ లాగిన్ లోకి వెళ్తాయి. వీటిపై తహసీల్దార్‌లు, ఆర్‌డీఓ విచారణ చేసి రిపోర్టు సమర్పిస్తే వాటి ప్రకారం కలెక్టర్ కరెక్షన్ చేయాల్సి వస్తుంది. కాని కలెక్టర్ దరఖాస్తులు పరిశీలనలో తీవ్రజాప్యం చేస్తున్నారని దరఖాస్తులు మొత్తం పెండింగ్‌లో పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన కలెక్టర్ స్పందించి ధరణి దరఖాస్తులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

నెలల తరబడి తిరుతున్నాం



మా భూమి రాంచంద్రాపూర్ గ్రామంలో ఉంది. భూమి ప్రాజెక్టులో పోయినట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దాని పరిష్కారం కోసం మీసేవలో దరఖాస్తు చేసుకుని నెలల తరబడి తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

–బినవేని శ్రీకాంత్, రాంచంద్రాపూర్

ఉన్నతాధికారులకు నివేదించాలి

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో హుస్నాబాద్ ఆర్‌డీఓ బెన్‌షాలోన్ ధరణి పెండింగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణిలో వచ్చిన దరఖాస్తులు వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జావిద్ అహ్మద్, డీటీ రాజిరెడ్డి, అశోక్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్ఐ హరీష్ కుమార్ తదితరులు ఉన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ప్రజావాణికి వచ్చే అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ 31 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ రెహమాన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించండి సారూ...

కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య తన భూమిని ఇప్పించాలని ప్రజావాణిలో అర్జీ పెట్టుకున్నాడు. తన పేరు మీద ఉన్న ఎకరం స్థలాన్ని సోదరుడు మాంకాల మల్లయ్య అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని గోడు వెల్లబోసుకున్నాడు. వయస్సు పైబడడం, పక్షవాతంతో కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నానని వేడుకున్నాడు.

తెలంగాణ గేదెలను ఇప్పించండి

అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన దళితులు గద్దె స్వామి, పోచయ్య, కుమారస్వామిలకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మినీ డెయిరీ మంజూరైంది. ఈ క్రమంలో పాడి గేదెలను ఆంధ్రా నుంచి కొనుగోలు చేసి ఇస్తామని అధికారులు చెబుతున్నారు. అక్కడి గేదెలు స్థానిక వాతావరణానికి తట్టుకోలేవని, తెలంగాణకు చెందిన గేదెలను ఇప్పించాలని వారు కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి
- పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిద్దిపేటరూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని, అర్హులందరికీ వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో 'డబుల్' ఇళ్లు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్లు ఇస్తామని పేద ప్రజలను తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం మభ్యపెడుతుందన్నారు. హరితహారం పేరిట రూ.వందల కోట్ల రూపాయలు ప్రభుత్వం వృథా చేస్తుందని ఆరోపించారు. సిద్దిపేటను అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న మంత్రి హరీశ్‌రావు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎందుకు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలన్నారు. గజ్వేల్ రూరల్ మండలంలో ఇళ్లు ఇస్తామని చెప్పి ఉన్నవాటిని కూలగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నకోడూరు మండలంలో 25 గ్రామ పంచాయతీలుంటే ఎనిమిది పంచాయతీల్లో మాత్రమే డబుల్ ఇళ్లు కట్టించారన్నారు. కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు కేటాయించిన నిధులతోనే సిద్దిపేటలో రెండు వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టారని తెలిపారు. సిద్దిపేటలో ఒకే కమ్యూనిటీ చెందిన వారికి, బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. దీనిపై మళ్లి సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ సిరిసిల్ల జిల్లా ఇంచార్జి గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అంబటి బాలేష్ గౌడ్, బూరుగు సురేష్ గౌడ్, కోడూరి నరేష్, పత్రి శ్రీనివాస్‌యాదవ్, ఉపేందర్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం.. చెత్త ఏరివేతతో స్వచ్ఛత

ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నడకతో ఆరోగ్యం.. చెత్త ఏరివేతతో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని 18వ వార్డులో 'నడుస్తూ చెత్త ఏరుదాం' కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వార్డులో మురికి కాలువల్లో ఉన్న చెత్తను, ప్లాస్టిక్ కవర్‌లను వేరు చేసి చెత్త సంచిలో వేశారు. అనంతరం వార్డులో కలియ తిరుగుతు వార్డు సభ్యులకు చెత్త ఆరుబయట వేయరాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇంటితో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని పిలుపునిచ్చారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, అధికారులు నిత్యం వేకువ జామున పట్టణంలో కలియ తిరుగుతూ ప్రజలకు చెత్తోపదేశం చేయడం ఆహ్వానించదగిన విషయమన్నారు.

అద్భుతమైన ఔషధం యోగా

సిద్దిపేటజోన్: సహజ సిద్ధమైన, అద్భుతమైన ఔషధం లాంటిదే యోగా అని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక 22 వార్డులో ఉచిత ఆనంద యోగా శిక్షణ తరగతులను సందర్శించి, వారికి మ్యాట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య సిద్దిపేట సాధించడమే తన ధ్యేయమన్నారు. యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, అరవింద్, అంజయ్య, అశోక్ పాల్గొన్నారు.



8వ వార్డులో పర్యటిస్తున్న మంత్రి హరీశ్‌రావు, మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు

కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం

హుస్నాబాద్: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మంత్రి హరీశ్‌రావు కాన్వాయ్‌ని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు, కార్మికులు కలిసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. హుజురాబాద్ నుంచి సిద్దిపేటకు వెళుతున్న మంత్రి కాన్వాయ్‌ని హుస్నాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద అడ్డుకోవాలని చూడగా, పోలీస్‌లు వారిని అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్. జేరిపోతుల జనార్ధన్, రాజు నాయక్, కార్మిక సంఘం నాయకులు దుర్గం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



చెత్త సంచితో నడుస్తున్న మంత్రి హరీశ్‌రావు

బండెంట బల్దియా

- మొక్కవోని సంకల్పంతో స్వచ్ఛ్ సిద్దిపేట దిశగా అడుగులు
- నడకతో చెత్త సేకరణ
- ప్రజల్లో స్ఫూర్తిదాయక స్పందన

సిద్దిపేటజోన్: మొక్కవోని సంకల్పంతో స్వచ్ఛ్ సిద్దిపేట కోసం బల్దియా చేపడుతున్న విభిన్న కార్యక్రమాలకు విశేష స్పందన వస్తోంది. దశాబ్దం క్రితం పడిన స్వచ్ఛత అడుగులు సిద్దిపేట బల్దియాకు జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టాయి. ఇంటింటికి చెత్త సేకరణ నుంచి మొదలు చెత్త ద్వారా సంపాదన సాధించి పెట్టే స్థాయిలో ప్రస్తుతం సిద్దిపేట బల్దియా నిలిచింది. ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆలోచన విధానాలకనుగుణంగా ఆదర్శ మున్సిపల్ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారులు మున్సిపల్ చెత్త బండి వెంట నడుస్తూ వార్డులో పారిశుద్ధ్య పనులు చేపడుతూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

జిల్లాలోని ఏకైక స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ సిద్దిపేట పట్టణంలో అనధికార లెక్కల ప్రకారం 50వేల నివాస గృహాల్లో రెండు లక్షల జనాభా ఉంది. మున్సిపల్ రికార్డుల ప్రకారం పట్టణంలో 54 మెట్రిక్ టన్నుల తడి, పొడి, హానికర చెత్త సేకరణ చేస్తున్నారు. వాటిని వేరు చేసి చెత్తను పునర్వినియోగం చేసేలా ప్రత్యేకంగా యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చేలా వార్డులో కంపోస్టు యూనిట్లను అందుబాటులోకి తెచ్చారు. చెత్త ప్రాముఖ్యత తెలిపేలా స్వచ్ఛ్ బడి ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ నిషేధ ప్రక్రియ పటిష్టం చేసి ప్రతి వార్డులో ప్రజలకు స్టీల్ బ్యాంక్ అందుబాటులోకి తెచ్చారు.

వినూత్న రీతిలో అడుగులు

ప్రజలను మరింత భాగస్వామ్యం చేసేలా ఇటీవల మంత్రి హరీశ్ రావు సూచన మేరకు వినూత్న రీతిలో అడుగులు వేస్తున్నారు. ప్రతి రోజు తెల్లవారుజామున మున్సిపల్ చైర్మన్, కమిషనర్ నుంచి మొదలుకొని కౌన్సిలర్లు, అధికారులు వార్డులో చెత్త సేకరణ వాహనం వెంట గల్లీలో క్షేత్ర స్థాయిలో తిరగాలి. నడకతో చెత్త ఏరుదాం–చెత్త వేరుచేద్దాం అనే నినాదంతో బల్దియా మొత్తం గల్లీలో తిరుగుతూ చెత్త సేకరణ చేస్తున్నారు. పనిలో పనిగా ప్రజలకు అవగాహన కల్పించి, చెత్త ప్రాముఖ్యత గూర్చి చైతన్యం చేస్తున్నారు. గతంలో సాక్షాత్తు మంత్రి హరీశ్ రావు వార్డుల్లో చెత్త బండి వెంట తిరిగి వార్డులో ప్రజలను చైతన్యం చేశారు.ఇప్పటికే పట్టణంలో 20 వార్డుల్లో ప్రక్రియ జరిగింది. మరో 23 వార్డులో జరగనుంది. మరోవైపు మంత్రి హరీశ్ రావు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూప్ ద్వారా నిరంతరం ఈ ప్రక్రియను పరిశీలించి, తగు సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర మంత్రి హరీశ్ రావు, పోలీస్ కమిషనర్ శ్వేత పట్టణంలో నడక ద్వారా రోడ్డు వెంట ఉన్న చెత్తను ఏరివేస్తూ ఆదర్శంగా నిలిచారు.



నడకతో చెత్త ఏరుదాంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారులు (ఫైల్)

నడక ద్వారా చెత్త ఏరివేత బాగుంది



వార్డులో నడక ద్వారా చెత్త సేకరణ ప్రక్రియ బాగుంది. దీనిద్వారా ఓట్లు వేసిన ప్రజల సమస్యలు దగ్గరగా తెలుసుకొని పరిష్కరించే అవకాశం ఉంటుంది. మరోవైపు చెత్త గురించి ప్రజల్లో చైతన్యం వస్తుంది.

–కవిత, కౌన్సిలర్

బహుళ ప్రయోజనం



నడకతో చెత్త ఏరుదాం అనే నినాదంతో మున్సిపల్ యంత్రాంగం వార్డులో తిరగడం బాగుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో వార్డులో పర్యటించడం వల్ల బహుళ ప్రయోజనంగా ఉంటుంది. ఇది నిరంతరం కొనసాగాలి.

–స్వప్న, గృహిణి

బల్దియా తీరు భేష్



సిద్దిపేట మున్సిపాలిటీ మొత్తం వార్డులో నడకతో చెత్త ఏరుదాం, చెత్త వేరుచేద్దాం అనే నినాదంతో సాగడం అభినందనీయం. దీని ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. చెత్త కుండీలు లేని మున్సిపాలిటీగా రికార్డు సాధించాలి. ఇదే స్ఫూర్తితో నిరంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు సాగాలి.

–హరీశ్‌రావు, వైద్యారోగ్యశాఖ మంత్రి

ఉద్యాన డిప్లొమా కోర్సులో ప్రవేశానికి నేడు కౌన్సెలింగ్



ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగులోని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి రెండేళ్ల ఉద్యాన డిప్లొమా కోర్సు(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 25న ములుగు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఏ భగవాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్ లేదా పాలీసెట్–2023లో అర్హతపొందిన లేదా ఇంటర్ ఫెయిలై దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. సీట్లు మిగిలితే దరఖాస్తు చేయనివారికి కూడా అదేరోజు స్పాట్ అడ్మిషన్ ఇస్తామని పేర్కొన్నారు. అయితే దరఖాస్తు చేయనివారు తమ వెంట అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్ సెట్లు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులైతే రూ.600, ఇతరులు రూ.1100 కంట్రోలర్, ఎస్కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పేరున డీడీ తీసి కౌన్సెలింగ్‌కు రావాలన్నారు. ఇతర వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ.ఏసీ.ఇన్‌లో చూడాలన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాజయ్య

రాయపోలు(దుబ్బాక): మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వనందుకు మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యకుమార్ కథనం ప్రకారం.. మండలం ముబారస్పూర్‌కు చెందిన పసులాది రాజయ్య (55) మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 17న తాగేందుకు డబ్బులు కావాలని ఇంట్లోవారితో గొడవపడ్డాడు. ఎవరూ ఇవ్వకపోవడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుమారుడు కరుణాకర్, కుటుంబసభ్యులు వెంటనే గజ్వేల్ తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఇక్కడ చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందాడు. కొడుకు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

బీజేపీ నేతలపై కేసు

సిద్దిపేటకమాన్: పోలీసుల అనుమతి లేకుండా.. సివిల్ కోడ్‌కు మద్దతుగా పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డితోపాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు నిర్వహించాలంటే అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ : ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పుల్కల్ ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహిళ (50) మృతదేహం చౌటకూర్ మండలపరిధిలో గల కొర్పోల్–లింగంపల్లి గ్రామాల శివారులో ఉన్న వాగులో గుర్తించారు. ఈ మహిళ గురించి సమాచారం తెలిస్తే 87126 56723, 8712656754 నంబర్లలో సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు.

తప్పిపోయిన చిన్నారి శిశుగృహానికి తరలింపు



బాలిక

సిద్దిపేటకమాన్: తప్పిపోయిన గుర్తు తెలియని చిన్నారిని అధికారులు సంరక్షించి పట్టణంలోని శిశుగృహ వసతి కేంద్రానికి సోమవారం తరలించారు. గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో శనివారం సుమారు 5 ఏళ్ల వయస్సున్న బాలిక ఏడుస్తూ ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు జిల్లా బాలల సంక్షేమ సమితి అధికారులకు సమాచారమిచ్చారు. కాగా వారు సిద్దిపేటలోని శిశు వసతి గృహానికి తరలించారు. మంగళవారం బాలికకు వైద్యపరీక్షలు నిర్వహించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సీడబ్ల్యూసీ చైర్మన్ రాజలింగం తెలిపారు.

కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృత్యువాత

అక్కన్నపేట(హుస్నాబాద్): కుక్కల దాడిలో రెండు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మండలంలోని గుడాటిపల్లిలో ఉన్న చింతల్‌తండాకు చెందిన అజ్మీర చంద్రు గొర్రెలు మేపుతూ జీవిస్తున్నాడు. రోజులానే సోమవారం కూడా గొర్రెలను మేపిన అనంతరం కొట్టంలోకి తోలాడు. హఠాత్తుగా వచ్చిన కుక్కలు, మందపై దాడిచేశాయి. ఈ దాడిలో రెండు గొర్రెలు మృత్యువాతపడ్డాయి. సుమారు రూ.20వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు చెబుతున్నాడు.



కోనేటి వాగులో చేపలు పడుతున్న మత్స్యకారులు

మత్స్యకారుల సంక్షేమానికి మోకాలడ్డు !

- అడ్డంకిగా మారిన 2 ఎకరాల నీటి విస్తీర్ణం నిబంధన
- దీనిని సడలించాలని విజ్ఞప్తి
- ఇటీవల 18 నుంచి 70 ఏళ్ల వయస్సు వారికి సభ్యత్వం ఇవ్వాలని సర్కారు ఆదేశాలు

ఇటీవల ప్రభుత్వం 18ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు వారికి మత్స్యకార సొసైటీలో సభ్యత్వాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చింది. ఒకరికి ..రెండు ఎకరాల నీటి విస్తీర్ణం అనే నిబంధన మత్స్యకార సొసైటీలో చేరడానికి అడ్డంకిగా మారింది. ఈ నిబంధన సడలిస్తే ప్రభుత్వం లక్ష్యం నెరవేరుతుంది. అర్హులైన మత్స్యకారులకు సహకార సొసైటీలో సభ్యులుగా చేరే అవకాశం ఉంటుంది.

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం కులవృత్తులు ప్రోత్సహించేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తోంది. మత్స్యకారుల సంక్షేమం కోసం ఉచితంగా ఏటా చేప పిల్లలు పంపిణీ చేస్తోంది. ముదిరాజ్‌లు, మత్స్యకారులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు అందిస్తోంది. తొలి విడతలో ఒక మత్స్యకార సొసైటీలో 100 మంది సభ్యులుంటే 30 మంది వరకే సబ్సిడీ యంత్రాలు అందుకున్నారు. మిగితా వారు ఎదురుచూస్తున్నారు. పథకాల లబ్ధిపొందాలంటే మత్స్యకార సొసైటీలో సభ్యత్వం ఉండాలి. కానీ విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం 18 నుంచి 70 ఏళ్ల వారికి అవకాశం కల్పించింది. జిల్లాలో 283 సొసైటీల్లో 20,500 మంది సభ్యులు ఉండగా, కొత్తగా మరో 12 వేలపైగా సభ్యత్వాలు అధికారులు అందించారు. జిల్లాలో 3,443 చెరువు కుంటల నీటి విస్తీర్ణానికి లోబడి మాత్రమే సొసైటీల్లో సభ్యత్వాన్నిస్తారు.

ప్రభుత్వం 18 ఏళ్ల వారికి సభ్యత్వం ఇవ్వడం కొత్తవారికి ఆశలు కల్పించినా చెరువుల నీటి విస్తీర్ణం నిబంధన అడ్డు వచ్చింది. మత్స్యకారుల సొసైటీల నిబంధనలు ప్రకారం ఒక మత్స్యకారుడికి 2 ఎకరాల నీటి విస్తీర్ణం ఉండాలి. ఉదాహరణగా ఒక ఊరు చెరువు విస్తీర్ణం 100 ఎకరాలుంటే ఆ ఊరు సొసైటీలో 50 మందికి సభ్యత్వం పొందే అవకాశం ఉంటుంది. దీంతో

అందరూ సభ్యత్వం పొందలేకపోతున్నారు..

ఆ గ్రామంలో 200 కుటుంబాలు ఉన్న అందరూ సభ్యత్వం పొందలేకపోతున్నారు. సభ్యత్వం ఉన్న వారే పథకాలకు అర్హులవుతున్నారు. చెరువుల నీటి విస్తీర్ణం నిబంధన.. చేపలు పట్టే నైపుణ్య ఉన్న యువకులకు సొసైటీలో చేరేందుకు అడ్డు వస్తోంది. ప్రభుత్వం ఆలోచించి ఈ నిబంధనను తొలగించి ప్రతి మత్స్యకారుడికీ సభ్యత్వం ఇవ్వాలి. గొల్లకురుమలకు ఇస్తున్నట్లుగానే ప్రతి మత్స్యకారుడికీ స్వయం ఉపాధి, వ్యాపార అభివృద్ధి కోసం సబ్సిడీపై ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, వలలు, పడవలు అందించాలని కోరుతున్నారు. సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని కోరుతున్నారు.

అందరికీ సబ్సిడీ వాహనాలు అందించాలి



గొల్లకురుమలకు ఇస్తున్న విధంగానే సొసైటీ సభ్యత్వం పొందిన ప్రతి మత్స్యకారుడికీ సబ్సిడీ వాహనాలు అందించాలి. ప్రభుత్వం ఇచ్చే చేపల పెంపకంతో ఉపాధి, వ్యాపార అభివృద్ధి చేసుకోవాలంటే 4 చక్రాల వాహనాలు, బైక్‌లు అవసరం ఉంది.

– పొన్నబోయిన శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు

తెలంగాణ వచ్చిన తర్వాత ఉపాధి కోసం..



తెలంగాణ వచ్చిన తర్వాత మత్స్యకారుల ఉపాధి కోసం ఉచితంగా చేప పిల్లలను ఇచ్చి పెంచుకోనే అవకాశం కల్పించింది. కొత్తవారికి సొసైటీల్లో సభ్యత్వం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా చెరువుల నీటి విస్తీరణం నిబంధనతో సభ్యత్వం పొందలేకపోతున్నారు. ఈ నిబంధనను తొలగించి ప్రతి మత్స్యకారుడికీ సొసైటీల్లో సభ్యత్వం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

– పెంద్యాల అయిలయ్య, హుస్నాబాద్ ముదిరాజ్ సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు

సకాలంలో వైద్యం అందక శిశువు మృతి

- డెలివరీ చేసే అనుమతుల్లేవని ఆస్పత్రిపై వైద్యాధికారుల ఆగ్రహం
- కొనసాగుతున్న విచారణ



విచారణ జరుపుతున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): సకాలంలో వైద్యం అందకపోవటంతో శిశువు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని బొల్లారంలో సోమవారం జరిగింది. ఆ ఆస్పత్రికి డెలివరీ చేసే అనుమతులు లేకపోవడం చర్చనీయాంశమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. బొల్లారానికి చెందిన ఓ గర్భిణి. సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వెళ్లగా మూడు రోజుల్లో ప్రసవం జరగొచ్చని వైద్యులు చెప్పారు. సోమవారం ఉదయమే ఆమెకు ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. కుటుంబీకులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. డెలివరీ చేసే క్రమంలో శిశువు మృతిచెందింది. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగనిర్మల, స్థానిక ప్రభుత్వాస్పత్రి వైద్యురాలు రాధిక, సిబ్బంది ఆ ఆస్పత్రిని సందర్శించారు. శిశువు మృతికి గల కారణాలు ప్రైవేటు ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనుమతులు లేకున్నా డెలివరీలు ఎందుకు చేస్తున్నారని అధికారులు ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రికి డెలివరీ చేసే అర్హత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తమ కుమార్తెకు డెలివరీ చేయమని తామే వైద్యులపై ఒత్తిడి తీసుకొచ్చామని, వారి ప్రమేయం ఏమీ లేదని బాధితులు జిల్లా అధికారులకు వివరించారు. ఈ విషయమై దర్యాప్తు జరుపుతామని అధికారులు చెప్పారు.

ప్లంబర్ చేతివాటం

- చోరీ కేసులో వీడిన మిస్టరీ
- 32 తులాల బంగారం, 23 తులాల వెండి, నగదు రికవరీ



మాట్లాడుతున్న చేర్యాల సీఐ సత్యానారాయణరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ఈనెల 22న జరిగిన చోరీ కేసులో నిందితుడిని కొమురవెల్లి పోలీసులు పట్టుకున్నారు. సోమవారం చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి, స్థానిక ఎస్ఐ చంద్రమోహన్ యాదవ్‌తో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈనెల 22న ఉదయం ఇంట్లో చోరీ జరిగిందని అంబటిపల్లి అర్చన ఫిర్యాదు చేయగా ఎస్ఐ చంద్రమోహన్ యాదవ్ కేసు దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ప్లంబర్ మల్లేశం దొంగతనం చేసినట్లు గుర్తించారు. అతడు ఇంట్లో పని చేస్తున్న సమయంలో విహారయాత్రకు వెళ్తున్నట్లు చెప్పుకున్న మాటలు విన్నాడు. ఈనెల 22న ఉదయం పైగది తాళం పగలగొట్టి బంగారు, వెండి నగలు, నగదు దొంగిలించుకుపోయాడు. సోమవారం ఉదయం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లిలో నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి 32 తులాల బంగారం, 23 తులాల వెండి, రూ.లక్షా 17 వేల నగదును రికవరీ చేశారు. జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు. కేసు ఛేదించిన ఎస్ఐ చంద్రమోహన్ యాదవ్‌ను, సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఏఎస్ఐ రాంమూర్తి, సిబ్బంది బాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు

- ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో సిద్దిరాములు మృతదేహం

పటాన్‌చెరుటౌన్ : స్కూల్ బస్సు ముందున్న బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని ఇంద్రేశానికి చెందిన నాగేశ్(39) టిప్పర్ డ్రైవర్. సోమవారం సాయంత్రం అతడు, నర్సింగ్‌రావుతో కలిసి బైక్‌పై రామేశ్వరంబండ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషన్ స్కూల్ బస్సు తన ముందున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, గాయపడిన నర్సింగ్‌రావును చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నాగేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదం ..

గుర్తుతెలియని వాహనం ఢీకొని పరిశ్రమ ఆపరేటర్ మృతి

జిన్నారం(పటాన్‌చెరు): రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఓ వ్యక్తిని వెనుక నుంచి వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. గుమ్మడిదల ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. కామారెడ్డిలోని బాంబే కాలనీకి చెందిన సిద్దిరాములు (50) 7 ఏళ్ల నుంచి బొంతపల్లి పారిశ్రామికవాడలోని రక్షిత్ డ్రగ్ పరిశ్రమలో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం గుమ్మడిదలకు వెళ్లిన సిద్దిరాములు నడుచుకుంటూ బొంతపల్లి వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన ఓ వాహనం అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. 108లో నర్సాపూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సిద్దిరాములు కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ముగ్గురు అదృశ్యం

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. పటాన్‌చెరులో డిగ్రీ ఫస్టియర్ విద్యార్థిని, కందిలో బీటెక్ సెకండియర్ స్టూడెంట్, జిన్నారంలో స్నేహితుల వద్దకు వెళ్తున్నానని యువతి అదృశ్యమయ్యారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..

పటాన్‌చెరు టౌన్: డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని అదృశ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ జగదీశ్ కథనం ప్రకారం.. మండలంలోని ఇస్నాపూర్‌లో నివాసం పండరి కూతురు (19) సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతుండేది. ఈనెల 23వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కుటుంబసభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తండ్రి తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. తండ్రి సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐఐటీ విద్యార్థి అదృశ్యం



కార్తీక్

కంది (సంగారెడ్డి): ఐఐటీ హైదరాబాద్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. రూరల్ ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంక్ తండాకు చెందిన కార్తీక్(21) సంగారెడ్డి సమీపంలోని కంది వద్ద ఉన్న ఐఐటీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 17న ఇంటికి వెళుతున్నానని చెప్పి క్యాంపస్ నుంచి వెళ్లాడు. అయి తే.. అతను ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ వచ్చింది. కార్తీక్ తల్లిదండ్రులు ధనావత్ ఉమ్లానాయక్, సైదమ్మ సంగారెడ్డిరూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కార్తీక్ విశాఖపట్నం వెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు అతని తల్లిదండ్రులను వెంటబెట్టుకొని విశాఖకు వెళ్లారు. కార్తీక్ ఆచూకీ దొరకలేదని ఎస్ఐ తెలిపారు.

స్నేహితుల వద్దకు వెళుతున్నా...



సరస్వతి

జిన్నారం(పటాన్‌చెరు): స్నేహితుల వద్దకు వెళ్లిన ఓ యువతి తిరిగి రాకపోవటంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొల్లారం సీఐ నయీముద్దీన్ కథనం ప్రకారం.. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల వెంకట్‌రెడ్డినగర్ కాలనీలో నివాసం ఉండే వంటారపు చిన్నారావు చిన్నకుమార్తె సరస్వతి ఈనెల 23న స్నేహితుల వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తులో ఉంది.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

రాయికోడ్(అందోల్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అమృత్, రాయికోడ్ మండల అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఉద్యోగస్తులతో కలిసి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నుంచి ఈనెల 16న రథయాత్ర ప్రారంభమైందన్నారు. 29న సంగారెడ్డిలో రథయాత్ర ఉంటోందన్నారు.



హుస్నాబాద్ భారీ వర్షం

హుస్నాబాద్ : పట్టణంలో సోమవారం భారీ వర్షం కురిసింది. రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. మురుగు కాలువలు రోడ్ల పై పొంగిపొర్లడంతో దుకాణాల్లో నీరు చేరి వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. అలాగే బస్టాండ్ చుట్టూ వరద నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

భూమి కబ్జా చేస్తున్నారని..

- తహసీల్దార్ కార్యాలయంలో రైతు ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న స్థానికులు



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

చేగుంట(తూప్రాన్): ఓ రైతు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భూ సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన సంద్రుగు రవి తండ్రి పేరిట 14, 53, 51 సర్వే నంబర్లలో 7 ఎకరాల భూమి ఉంది. కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమిస్తున్నారట. 2017 నుంచి జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆపై కోర్టులోనూ కేసు వేసినట్లు చెప్పి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ శరీరంపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే తేరుకొన్న స్థానికులు అతడిని అడ్డుకున్నారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్ వివరణ కోరగా, 2 రోజుల క్రితం తాను తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నానని, పూర్తి వివరాలు సేకరిస్తానని, భూమిని ప్రత్యక్షంగా సందర్శిస్తానని, ఉన్నతాధికారులకు నివేదిక పంపించి బాధితుడికి న్యాయం చేస్తానన్నారు. కాగా బాధిత కుటుంబీకులు, తహసీల్దార్‌తో మాట్లాడారు.

ఆర్థిక ఇబ్బందులతో గొడవలు

- మనస్తాపంతో భర్త ఆత్మహత్య



అన్సారీ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి గ్రామశివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కానుకుంటలో సోమవారం జరిగింది. ఏఎస్ఐ రాజు కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన సైరూల్ అన్సారీ(38) కానుకుంట సమీపంలోని పరిశ్రమలో పనికి కుదిరాడు. అతడికి భార్య, కుమారుడు ఉన్నారు. వారం నుంచి ఆర్థిక పరమైన ఇబ్బందులతో భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి మనస్తాపం చెందిన అతడు గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వరినారుతో కేటీఆర్ పేరు ...

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కూలీలు

మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండల పరిధిలోని కొచ్చెరువు తండాకు చెందిన రైతు కూలీలు వరి తూకం నారు కట్టాలతో మంత్రి కేటీఆర్ పేరుగా రాశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొచ్చెరుతండా బీఆర్ఎస్ నేత శ్రీనుతో పాటు తండావాసులు పాల్గొన్నారు. కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. – హవేళీఘనపూర్